పాట పాడుకుంటూ బిచ్చమెత్తుకునే వాడిని తన అల్లుడిగా చేసుకొన్న అతను స్వార్థపరుడు ఎలా అయ్యాడు?

గంటి వెంకటరమణ కథ

# పలకని అపశృతి

రైలు శరవేగంతో సికింద్రాబాద్ వైపు వెడుతోంది. కంపార్ట్‌మెంట్‌లో జనం కిక్కిరిసి వున్నారు. ఓ వైపు జోరుగా చతుర్ముఖపారాయణం సాగుతోంది. రైలు చేసే శబ్దంలో అతిమధురంగా, మంద్రంగా వినిపిస్తున్న పాటలీనమై అక్కడున్న వాళ్ళని అంతర్లీనం చేసుకుంటోంది. అతను కంపార్ట్‌మెంట్‌లో ఓవైపు ఆనుకుని కుడీ, ఎడమ చేతుల్తో తాళం వేస్తూ ఓసారి ముఖేష్‌నీ, మరోసారి సైగల్ని మధ్య మధ్య మహమ్మద్ రఫీనీ తన కంఠంలో జీర్ణం చేసుకుంటున్నాడు.

'ఆ. లౌట్ కే ఆజ్ మేరీ మీత్....'

అంతవరకు రమ్మీ ఆడుతున్న నలుగురూ ఆటని మధ్యలో ఆపేశారు. కంపార్ట్‌మెంట్‌లో సూదిపడినా వినిపించేట్లుంది.

'ఏ భారత్ దేష్ హై మేరా, యహడాల్ డాల్'...

"వాహే... వారేవా..."

అంతవరకూ పాట వింటున్న బట్టతలాయన లేచి కూర్చున్నాడు. అప్పటివరకూ ఈగోల భరించలేనట్లు పేపర్లో మొహం దూర్చిన ఆయన ఆ పేపర్ని మడతపెట్టడం కూడా మరిచిపోయి గుండెమీదవేసుకున్నాడు. ఆ గ్రుడ్డివాడివైపు అందరూ సానుభూతితో చూస్తున్నారు.

ఈ ప్రపంచంలో తన కేమీ సంబంధంలేనట్లు అతను పాడుతూనే వున్నాడు. 'ఈ గానం నా జీవితానికి వూపిరి, నా శరీరానికి బలిమీ, కలిమీ, చెలిమీ తెచ్చిపెట్టే 'ఈ నాదం నాదైన దైవం'



అనుకుంటున్నాడో ఏమో విషాదంలో ఎదుటి వ్యక్తుల కళ్ళల్లోకి నీళ్ళు తెప్పించే అతని కంఠస్వరం ప్రశాంతంలో ఆహ్లాదాన్ని పంచి పెడుతోంది.

ఆయన గొంతు సవరించుకున్నాడు "బాబూ."

రెండోసారి ఆయన పిలుపుకి తల తిప్పాడు.

"నీకు తెలుగు పాటలు వచ్చా"
సిగ్గుపడ్డట్లు తలదించుకున్నాడు.
"చెప్పబాబూ"
"ఏం పాడమంటారండీ"
"ఘంటసాల పుష్పవిలాపం పాడగలవా?"
అతను తల అడ్డంగా తిప్పి "కుంతీవిలాపం ఆలపించమంటారా సార్' అన్నాడు.

ఆయన సంబరంగా "అలాగే" అన్నాడు.
కుంతీ కుమారి మెట్లుదిగుతూ కసికందుని గంగలోకి జారవిడువడం వరకూ రాగానే ఎదుటి బెర్త్‌మీద బామ్మగారు రెండు చేతులూ జోడించి 'నమస్కారం' చేసింది.

"అరె బైజు బావరా కాగాన గావో భాయ్"
అతను అరుపు, పొలుపు ఎరగనట్లు పాట అందుకున్నాడు. ఆయన కిటికీలోంచి బయటికి చూస్తున్నారు. అకాల వర్షాలు కురుస్తున్నట్లూ, మేఘాలు పరవశం అయి ఆకాశంలో ఏనుగుల మాదిరి గుంపులు గుంపు లుగా చేరినట్లూ అనుభూతి కలుగుతోంది ఆయనకి.

అరగంట గడిచింది. ఆయన వూహించింది అబద్ధం కాదన్నట్లుగా ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ పొలిమేరలు మేఘాలతో ఆకాశానికి అందమైన నల్లచీరకట్టాయి. పచ్చని పచ్చికబయళ్ళు చిరుగాలికి ఒళ్ళు విరుచుకుంటున్నట్లు సన్నగా వూగిసలాడుతున్నాయి.

అతను పాడుతున్నాడు. వర్షపు చుక్క ఒకటి తప్పనపడింది. అంతలోనే ఆకాశం విరహవేదన భరించలేని పుడమి తల్లిని అందుకునేందుకు రెండు చేతులూ చాచినట్లూ విపరీతంగా శబ్దం చేస్తూ వర్షపు ధారలతో తన ప్రేమ ప్రవాహాన్ని ధారపోస్తోంది.

అప్పటివరకూ పాడిన అతను పాట ఆపాడు. అతని జేబులో పేకాడేవాళ్ళు కొత్త నోట్లు కట్టని వుంచారు.

ఆయన ఆశ్చర్యపోయారు. గంటలరతబడి ఐదు పదిపైసలకోసం ఆడుకున్న ఆ నలుగురూ ఆటలో గెలుచుకున్న డబ్బుతో బాటు జేబులోంచి తీసి వేయడం వాళ్ళ హృదయస్పందనకి నిలువెల్లా సంభ్రమాశ్చర్యాలు ముప్పిరి గొంటూంటే తనకి తాను మరిచిపోయే జేబులో చేయిపెట్టారు. నిండు గర్భిణిలా వున్న ఆ పర్సు ఆయన చేతికి తగిలింది. ఐదు, పది సెకెండ్లు ఆలోచించి ఆ డబ్బుని జేబులోపలికి తోసేశారు.

స్టేషనేదో రాబోతూంటే పేకాడినవాళ్ళు సామాను సర్దుకుని 'వస్తం భాయ్' అన్నారు అతని భుజం మీద చేయివేసి. అతను నవ్వీనవ్వనట్లు ఓసారి వాళ్ళు మాట్లాడే వైపు చూసి తలవొంచుకున్నాడు.

అతను కూడా దిగే ప్రయత్నంలోవుండడం పెద్దాయన కనిపెట్టాడు. అతని చేతిని అందుకుని పక్కన చోటు యిచ్చి కూర్చోబెట్టాడు.

"ఏవూరు మీది?"

అతను తలెత్తి ఆయన వైపు మొహం తిప్పాడు.

"పెళ్ళయిందా?"
అతను సాధానం చెప్పలేదు.

చెప్పు బాబూ, కనీసం నీ పేరైనా చెప్పు!

"ఫ్రైదే",

ఆయన వులిక్కిపడ్డాడు. "ఆదేం పేరు? నేనెప్పుడూ వినలేదే. మీరు క్రిస్టియన్సా?"

అతను ఈసారి శబ్దం చేస్తూ నవ్వాడు! పేరు గురించి కులగోత్రాలు దేనికి లెండి. నాకు అన్నిదేవుళ్ళూ సమానమే. ఈ భూమ్మీదకి కుంతిలా అమ్మ విసిరేసిన రోజే నాకు కులం గోత్రం లేకుండా పోయాయి. ఎందుకు చేసిందో మా అమ్మ ఆపని. ఓ విధంగా ఆ విషయంలో నేను అదృష్టవంతుడినై బ్రతికిపోయాను. కులం అనే 'కాలమ్స్' లేకుండా చేస్తే అని బాధపడకుండా నేను మనిషినని మాత్రం చెప్పుకోగలను".

"ఫ్రైదే' పేరు విని అలాగన్నాను మిస్టర్ దే. ఏమనుకోకు. ఇంతకీ నీ పేరులో అర్థం అయినా చెబుతావా".

అతను ఓక్షణం ఆగి దీర్ఘంగా నిట్టూర్చాడు. "అంధుడు కె.సి.డే గొప్ప గాయకుడు కదండీ. వాళ్ళ తమ్ముడు మన్నాడే సంగతి వేరే చెప్పాలా? వాళ్ళమీద ఆరాధనతో నాకు నేనే ఫ్రైదే అని పెట్టుకున్నాను. ఆకలీ, నిరుద్యోగం, సమాజం, దురదృష్టం నన్ను కాల్చిపడేస్తూంటే ఫ్రై అయిపోతున్నాను. ఓ పక్క, నా బ్రతుకులో చీకటి తప్ప ఏముంది చెప్పండి. అందుకు 'డే' కలిపాను! "


"ఏం చదువుకున్నావు?"

నవ్వాడతను 'లోకాన్ని చూస్తూ కొంత నేర్చుకున్నాను. నేనెలా చదవగలనండీ'

"నీకు సంగీతం వచ్చా?"

"వుహూ నాది కేవలం అనుకరణ సంగీతం అంతే"

రైలు సాగుతోంది. అక్కడున్నవాళ్ళు ఫ్రైదే గురించి పట్టించుకోవడం మానేసి చాలాసేపు అయింది. ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు. అందరూ కిటికీలోంచి తలలు బయటికి పెట్టి స్టేషన్ కోసం



చూస్తున్నవాళ్ళే.

ఈయన మాత్రం వదలకుండా పట్టు కున్నాడు అతన్ని.

"నువ్వు నాతో వస్తావా?"

"ఎక్కడికి?"

"మా ఇంటికి"

"నేను వచ్చి ఏం చేయను?"

"నువ్వు వస్తానంటే చెబుతాను"

"చెబుతారా"

"నువ్వు మాయింటికి వస్తానంటే చెబితే బాగుంటుందని నా వుద్దేశ్యం."

అతను ఆలోచించి యిబ్బందిగా కదిలాడు.

"తొందరేంలేదు. స్టేషన్ వచ్చేందుకు పది నిమిషాలు పడుతుంది."

ఫ్రైడే జవాబు చెప్పలేదు.

ఆయన మీస మేషాలు లెక్క పెడుతున్నాడు. యిన్నేళ్ళ జీవితంలో ఆయన కచేరీలకి ఎన్నిటికో వెళ్ళాడు. హిందుస్తానీ, కర్ణాటక కచేరీలని ఎప్పుడూ 'మిస్' చేయలేదు. తన కున్న పరిధిలో తను మెచ్చిన గాయకులందరి పాటల్నీ రికార్డులుగా కొని లైబ్రరీ లాంటిది ఏర్పాటు చేసుకున్నాడు. తన సంగీతాన్ని అందిస్తే అందుకునేందుకు సంగీత ప్రియులు ఈరోజుకీ వేయి కళ్ళతో ఎదురుచూస్తూనే వున్నారు.

విశాలమైన బంగ్లా కారు మీద తప్ప కాలివడక ఎరుగని తనని ఆశీర్వదించి తన మేధస్సులో ఆ సరస్వతమ్మ తిష్ట వేసుకోబట్టే లక్ష్మీదేవమ్మ కోడలికి ఓ మెట్టు పైన వున్నట్లు నెత్తినే వైకుంఠం చేసుకుంది. ఆ శ్రీమన్నారాయణుల దయవల్ల, సరస్వతీ కటాక్షం వల్ల తనకేమీలోటులేదు. ఈ ఫ్రైడే లాంటి గాయకుడిని యింతవరకూ తను చూడలేదు. ఈ మృదుమధుర వేణునాదాన్నీ, పిల్లన గ్రోవినీ, సన్నాయిపాటనీ ఒకే గొంతులో పలికించగల గాయక మణిని యిదిగో యిప్పుడు చూస్తున్నాడు. తనతో వస్తే..

"నేను మీతో వచ్చేందుకు సిద్ధమేనండి. కానీ ఓ షరతు మీద అయితే వస్తాను", అతను ముందుకు ఒంగాడు.

"చెప్పుబాబూ"

"మీ యింట్లో నాకు దయాభిక్షగా స్థానం యివ్వకూడదు. నాకేమాత్రం అస్వతంత్రంగా అనిపించినా నేను వెళ్ళిపోతాను."

ఆయన వూపిరి పీల్చుకున్నాడు. "నీకే అవమానం, అసౌకర్యం వుండదు అక్కడ నిన్ను.. వద్దు ఇల్లు రానీ చెబుతాను! అన్నాడాయన."

"నా బట్టలూ, సర్టిఫికేట్లూ తెచ్చుకోవాలి నేను!"

"నాకోసం యింటినుంచి కారు వస్తుంది. మనం వెళ్ళేముందు నీ వస్తువులన్నీ తీసుకునే వెడదాం."

"సరిగ్గా యిరవై ఏడేళ్ళ క్రితం మీలాంటి వ్యక్తి మా అమ్మకి కలిసి వుంటే.. ఆవిడ మీ ఔదార్యానికి ఎంత సంతోషించేదో..." అతను ఆపైన మాట్లాడలేకపోయాడు.

ఈలోగా స్టేషన్ వచ్చేసింది. ఆయన తన సామాను సర్దేసుకున్నాడు. కూలీతో చెప్పాడు. ఆపైన ఫ్రైడేకి చేతిని

అందించాడు.

ప్లాట్‌ఫామ్‌దాటి స్టేషన్ బయటికి రాగానే డ్రైవర్ సిద్ధంగా వున్నాడు. ఆయన డ్రైవర్‌తో చెప్పి అతనితో బాటు కారులో వెనుక వైపు కూర్చున్నాడు. ఫ్రైడే చెప్పిన గుర్తుల్ని జాగ్రతగా ఫాలో అవుతూ ఓ చిన్న గల్లీ దగ్గరకారు ఆపాడు డ్రైవరు.

అతను తన చిన్న యింట్లోంచి సామాను తీసుకుని యింటామెకి డబ్బుయిచ్చేసి వచ్చి ఆయన పక్కన కూర్చున్నాడు. కారు బంజారా హిల్స్‌వైపు పోతుంటే ఫ్రైడే మూసుకుపోయిన కళ్ళల్లోంచి నీళ్ళు జారి ఆయన చేతి మీద పడ్డాయి. ఆయన ప్రేమగా ఆ చేతిని నిమిరాడు.

కారు గేట్లోకి వచ్చింది. ఓవైపు ఆపాక ఫ్రైడేని తీసుకుని మెట్లదగ్గర ఆగిపోయారాయన.

"వేనవేల జన్మలుగా ఎదురు చూసి చూసి...ఆపాట అతని కాళ్ళకి బంధనాలు వేసినట్లుకాగానే ఫ్రైడే అడుగుముందుకు వేయలేకపోయాడు. కమ్మని కోయిలగొంతు అక్కడున్న భవంతిలోంచి ప్రకృతిలోకి జలపాతంలా పరుగులు తీస్తూ వస్తోంది. ఆ సంగీత ప్రకంపనలు అతవి శ్రవణేంద్రియాలకి విందు భోజనం ఏర్పాటు చేస్తున్నాయి.

"రా బాబూ లోపలికి"

"ఆ పాట ఎవరిది?"

"మా అమ్మాయి మహితది"

"మహిత... ఎంత బాగుందీ పేరు", అతను మనసులోనే అనుకున్నాడు.

అప్పుడు విని ఆ పిల్ల మెట్లుదిగి క్రిందికి వచ్చింది.

తండ్రి ప్రక్కనే వున్న అతన్ని చూసి ఆగిపోయింది.

"ఫరవాలేదు రామ్మా. యితను....!" ఆయన నవ్వి "యితను ఫ్రైడే. మన రెడ్డిగారి పిక్చర్‌లో కొత్తగాయకుడ్ని ప్రవేశపెట్టాలనుకున్నారు కదా. ఆయన కోసం గాలించకుండానే తీసుకు వచ్చాను."

ఆ పిల్ల తలెత్తి భయం భయంగా చూసింది. తండ్రీ డ్రైవరూ తప్ప ఆ పిల్ల మరెవరి దగ్గరా బిడియపడకుండా వుండలేదు.

## పోయాడు



అరవయ్యేళ్ళు దాటిన వర్ధనమ్మ, సూర్యకాంతం అరుగుమీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

"నే వయసులో వుండగా రామయ్య అనే అతను నా వెంట తెగ పడేవాడు, నన్ను పెళ్ళాడకపోతే చనిపోతాననేవాడు. అయినా నే పెళ్ళాడలేదు" అంది సూర్యకాంతం.

"మరాయన చచ్చిపోయాడా?" అడిగింది వర్ధనమ్మ.

"ఆ.... పోయనేడాదే!" తాపీగా అంది సూర్యకాంతం.

—జంగాల అజయ్‌కుమార్ (గుంటూరు)

ఆమె అతనికి కొద్ది దూరంలో నిలుచుంది. నెమ్మదిగా తలెత్తింది. ఆ తర్వాత! 'నమస్తే!' అంది.

ఫ్రైడేకి శబ్దం వచ్చిన వైపు తల తిప్పడం అలవాటు. అతను ఆమె వున్నవైపు చూస్తూ సమాధానంగా "నమస్తే!" అన్నాడు.

వారం, రెండు వారాలూ గడిచేసరికి ఆ యింట్లో ఏగది ఎక్కడ వుందో పూర్తిగా తెలిసిపోయింది అతనికి. మూడు వారాలు గడిచేసరికి పెద్దాయనతో స్టూడియోకి వెళ్ళాడు. ఆయన మంచి రోజు కోసం యిన్నాళ్ళు ఆగారు.

సినీ ప్రపంచంలో పెద్దాయన సంగీతానికి పెద్దపీట వేసి ఆయన ఒక్కపాటకైనా బాణీ కడితే విని ఆనందించాలని తహతహలాడే నిర్మాతలు 'ఫ్రైడే'ని పరిచయం చేస్తున్నా భయపడలేదు. వాళ్ళకి ఆయన మీద అంత నమ్మకం వుంది.

స్టూడియోలో ఫ్రైడే గొంతు విప్పాడు. ఆర్కెస్ట్రాతో గొంతు కలపడం ఫ్రైడేకి కొత్తగా అనిపించలేదు. రైలు శబ్దంలోనూ, ఆ కూతలోనూ, ప్రకృతి ఒళ్ళోనూ అతను ఓనమాలు నేర్చుకుని ఒకవిధంగా తలపండిన వాడైపోయాడు.

అతనిపాట విన్న నిర్మాతలూ, ఆర్కెస్ట్రా సిబ్బందీ అతన్ని కౌగలించుకుని అభినందిచారు. ఆ విధంగా ఫ్రైడే సినిమారంగంలో మొదటి మెట్టు ఎక్కాడు. అంచలంచలుగా అవి అతని పాలిట పరమపదసోపాన పటంలో నిచ్చెనలు ఎక్కి వైకుంఠం చేరుకున్నట్లయింది. ఇదంతా జరిగేసరికి మూడు కాలెండర్లు మారాయి.

అతనికిచ్చిన పారితోషికం సరాసరి బాంక్ అకౌంట్‌లోకి వెళ్ళిపోతోంది. ఫ్రైడే ముందు మొహమాటంతో పెదవి విప్పలేకపోయాడు. ఆ తరువాత ధైర్యం లేకపోయింది.

ఆఖరికి ఓరోజు చెప్పాడు."గురువుగారూ మరినాకు సెలవు యిప్పిస్తే నేను వేరే యింట్లో వుంటానండీ!"

"ఆయన ఫెళ్ళున నవ్వాడు. ఇక్కడ నీకేం లోటు?"

ఈ యింట్లో నేనూ మహతీ తప్ప ఎవరూ వుండడంలేదు. నువ్వు వుండడం వల్ల మాకూ కాలక్షేపంగా వుంది.!

"మీకు భారంగా..."

"భలేవాడివోయ్ నీవల్ల నాకు లాభం జరుగుతోందిగానీ నష్టమేమీ రావడంలేదు!"

"గురువుగారూ మిమ్మల్నోమాట అడగవాండీ?"

"చెప్పు"

"అమ్మాయిగారు అంత మధురంగా పాడతారు కదా. ఈరోజుల్లో గాయనీ మణులు వ్రేళ్ళమీద వున్నారు. ఆమె నెందుకు పరిచయం చేయలేదండీ!"

"ఓ..అదా", ఆయన తేలికగా అన్నాడు! వాళ్ళమ్మకి ఈ సినిమా ప్రపంచం అంటే అంత మంచి అభిప్రాయంలేదోయ్ అమ్మాయిని తెరకి పరిచయం చేయవద్దని నాదగ్గర మాట తీసుకుంది. చచ్చిపోతున్న ఆమెకి మాట యిచ్చాను. నిలబెట్టుకోవాలి కదుటోయ్!"

"అదీ నిజమే" ఫ్రైడేకి ఆయన మీద గౌరవం మరో స్థాయిపైకి చేరుకుంది.

ఆంధ్రదేశంలోనే కాకుండా యావద్భారతదేశంలో ఫ్రైడే సంగీత ప్రియులకి ఆరాధ్యగాయకుడై పోయాడు. ఫ్రైడే పాడని సినిమాలేదు. హిందీ పరిశ్రమకి వెళ్ళడం అతనికి యిష్టంలేదు. పెద్దాయన మాట అతనికి శిరోధార్యం అయిపోయింది.

మరో వసంతం గడిచింది.

పెద్దాయన వయసు మీద పడుతోంది. ఆయన ఫ్రైడే పక్కన కూర్చున్నాడు. ఈ సినిమా ప్రపంచంతో తప్ప నాకు వేరే బంధువులూ, స్నేహితులూ లేకుండాపోయారు.

"నిన్నో కోరిక కోరాలని వుంది ఫ్రైడే!" ఆయన కంఠంలో ఆవేదన సుడిగుండాల్లో చిక్కుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

"చెప్పండి"

"మరేంలేదు. ఆ తరువాత నువ్వు కాదంటావేమోనని భయంగా వుంది."

"ఎంతమాట!" ఫ్రైడే బాధపడ్డాడు "ఏకలవ్యుడి గురించి విన్నాముగానీ ప్రత్యక్షంగా ఎవరమూ చూడలేదు. నన్నంత వాడిని చేసిన మీకోసం ఏం చేయమన్నా చేస్తానండీ. నా ప్రాణం కావాలా చెప్పండి నేనింక పాడడం మానేయాలా? చెప్పండి గురువుగారూ.'

"అరెరె—రె! ఆయన క్రమంగా చెప్పారు. మేళతాళాలతో చేసే పెళ్ళిళ్ళ పట్ల నాకు విశ్వాసం లేదు. నా ఆస్తి పేరు ప్రతిష్ఠలూ చూసి మహతిని చేసుకునేందుకు ఎంతోమంది సిద్ధంగా వున్నారు. నీకు తెలియని సంగతి ఒకటి యిప్పుడు చెబుతున్నాను. రెండుసార్లు హార్ట్ అటాక్ వచ్చినవాడిని. ఎప్పుడు ఏ క్షణంలో రాలిపోతానో నాకు తెలియదు. అందుకని....

"చెప్పండి మాష్టారూ"

"అందుకని నా ఎదుట ఈ యింట్లోనే మీ యిద్దరూ పూలదండలు మార్చుకుని ఒకటౌతారని ఆశపడుతున్నాను!"

ఫ్రైడే ఆ మాటలు వింటూనే వుక్కిరి బిక్కిరి అయ్యాడు. తనెక్కడా? తన అదృష్టం ఎక్కడా... "మీరు నేనో అనాథనవే సంగతి మరిచి పోతున్నారండీ!"

''లేదు అన్నీ ఆలోచించి ఈ నిర్ణయానికి వచ్చాను.''

## ఎలుక ప్రహసనం



ఎలుక వినాయకుడికి వాహనం! అయినా మన ఇంట్లో తిరుగాడుతున్న ఎలుకల్ని చూసి మన మెంతగానో విసుక్కుంటూ ఉంటాం. ఈ సంగతలా ఉంచండి! మొన్నీ మధ్యన గుజరాత్ రాష్ట్రంలోని కొత్తా సంఘాని అనే ప్రాంతంలో ఓ రోడ్డు ప్రమాదానికి ఎలుక కారణమయింది.

ఎంతో జోరుగా బస్సు డ్రైవ్‌చేస్తున్న డ్రైవర్ ప్యాంటులోకి ఉన్నట్లుండి ఓ గడుసైన ఎలుక దూరటంతో కంగారుపడిన డ్రైవర్ బస్సును ప్రమాదానికి గురిచేశాడు. 29మంది గాయపడటమేగాక, అయిదుగురి పరిస్థితి సీరియస్‌గా ఉందట. అయ్యో! అదండీ... ఎలుక గారి ప్రహసనం!

—జూపిటర్

"ఓ గుడ్డివాణ్ణి చేసుకునేందుకు ఆమెకి యిష్టం వుంటుందా?"

'ఎంత మాట..నీ గానమాధుర్యం ముందు ఆ సంగతి ఎప్పుడో మరిచిపోయింది మహతి. ఆమెకి యిష్టం అవడం వల్లే దాని క్షేమం కోరి నీతో చెబుతున్నాను."

ఫ్రైడే మరి జవాబు చెప్పలేదు.

ఓ మంచి రోజు చూసి యిద్దరికీ పెళ్ళిచేశారు ఆయన.

డ్రైవర్ మాత్రమే ఆ పెళ్ళికి పెద్దగా వున్నాడు. ఆ యిల్లూ , ఆ వైభవం, ఆ పిల్లకంఠస్వరం తను పెరిగిన జీవితం ఫ్రైడేకి బేరీజు వేసి చూపిస్తూ కృతజ్ఞతతో తల ప చేట్లుచేశాయి.

హోటల్‌లో పార్టీ ఏర్పాటు చేశారు పెద్దాయన. ఫ్రైడే పాటలరికార్డింగ్ వుండడం వల్ల అతను స్టూడియో నుంచి హోటల్‌కి వచ్చాడు. మహతి రాలేకపోయినా ఎవరూ ఏమీ అనుకోలేదు. అసలామె కూడా వచ్చేదే. ఆ క్రితం రాత్రి ఆమెకి స్వల్పంగా ఆరోగ్యం దెబ్బతింది.

మొత్తానికి పెద్దాయన పెద్ద మనసుకి అందరూ అభినందించారు. ఫ్రైడేని కూడా మెచ్చుకున్నారు.

ఫ్రైడే ఆ రాత్రి భార్యతో చెప్పాడు! "నాకు అవమానం లాంటిది జరిగితే నేను తిరిగి వెళ్ళిపోవాలనుకున్నాను. మీ నాన్నగారితో కూడా ఈమాటే చెప్పాను. ఆయన నన్నుకన్న కొడుకులా చూసుకోవ డమేకాదు. ఆఖరికి నాకీ సంఘంలోయింత స్థానం కూడా యిచ్చారు. రియల్లీ ఐయామ్ డామ్ హేపీ నౌ"

మహతి నవ్వి "యిది నా అదృష్టం". అంది.

పెద్దాయన ఏ ముహూర్తాన అన్నాడోగాని పట్టుమని పది నెలలు కూడా మరి వుండలేకపోయాడు. ఆయన పోయారని తెలిసి సినిమా ప్రపంచం మొత్తం ఆయనకి వీడ్కోలు యిచ్చింది. శ్రద్ధాంజలి ఘటించింది.

అంత పెద్ద యింట్లో ఆ ఒక్క మనిషిలోటూ భర్తీ చేయలేనట్లు అయిపోయింది. ఫ్రైడే చిన్నపిల్లాడిలా ఏడ్చాడు. అతనికి యింత క్రితం ప్రపంచం శూన్యంలా అనిపించేది. అదీ పెద్దాయన పరిచయం కాని క్రితం తిరిగి యిప్పుడు కటిక చీకట్లోకి తోసేసినట్లయింది.

మహతే భర్తని ఓదార్చాల్సి వచ్చింది.

"మహతీ గురువుగారు నన్ను ఒంటరివాడిని చేసి వెళ్ళిపోయారు. ఆయన ఎంత మంచివారో నీకు తెలీదు. ఆఫ్టరాల్ రైల్లో పాటలు పాడే నన్ను నాకు అవమానం జరుగుతుందేమో అలా జరిగితే వెళ్ళిపోవాల్సి వస్తుందేమో, ఆ తరువాత ఏం చేయాలో అనే ఆలోచించే వాడిని గాని నిన్ను నాకిచ్చి పెళ్ళిచేస్తారనుకోలేదు".

"వూరుకోండి ప్లీజ్"

"ఎంతమంచి మనసుకాకపోతే నీవంటి కూతుర్ని ఓ అనాథకుడికి యిచ్చి పెళ్ళిచేయగలరా?'"

మహతికి దుఃఖం వస్తోంది.

"ఆయన సహృదయంతో నన్ను ఆదుకోకపోయివుంటే ఏ పేవ్‌మెంట్ మీదో చిడతలు వాయిస్తూ పాడుతూ

అనారోగ్యంతో రోజులు లెక్క పెట్టేవాడినేమో!"

"ప్లీజ్" మహతి అతని నోరు చేత్తో సున్నితంగా మూసేసింది.

తన తండ్రి పట్ల ఆ అభాగ్యుడికి వున్న ఆరాధనా, ప్రేమ గౌరవం యివన్నీ ఆమెను కరిగించి వేస్తున్నాయి. విహ్వలంగా ఏడుస్తోంది. లక్షలు మూలుగుతున్నా తన లాంటి అనాకారిని ఎవరూ చేసుకోవడం లేదని ఫ్రైడేకి ఎలా తెలుస్తుంది? తన తండ్రి స్వార్థంలో అతన్ని యింత వాడిని చేశాడనే నిజం తెలిస్తే ఫ్రైడే గుండె ఆగిపోదూ?

ఫ్రైడే ఆమె చేతిని గట్టిగా పట్టుకున్నాడు! "ఆయనతో బాటు మనమూ పోలేం మహీ.. నన్ను నువ్వు కూడా ఒంటరిగా వదిలేయకు.. ఈ దుఃఖం మంటల్లో పోయేది కాదనుకో. అయినా తృప్తి కోసం ఓదార్పడం నాకెంతే తెలు... ప్లీజ్!"

ఫ్రైడే మనసులో అనుకున్నాడు 'ఒకప్పుడు తన ప్రియ శిష్యుడి బాగుకోసం ద్రోణాచార్యుల వారు ఏకలవ్యుణ్ణి మోసం చేశారు. యిప్పుడు కన్న కూతురు కోసం గురువుగారు నన్ను మోసం చేశారు. గురువు గురువే ఎప్పటికీ శిష్యుడు కూడా కాలమాన పరిస్థితులవల్ల శిష్యుడుగానే మిగిలిపోతున్నాడు. ఈ భారతదేశంలో సత్సంకల్పం కోసం, స్వధర్మం కోసం సంస్కారం జీర్ణించుకుపోయిన ఏ శిష్యుడైనా మోసాన్ని కూడా నవ్వుతూ భరించాలి మహీ. నాకు ద్రోహం జరిగిందనుకోవడం లేదిప్పుడు నేను. ఈ సంగతి ఆయన చెప్పివుంటే ఎంత బాగుండేది.

ప్రమాదంలో కాలిపోయిన నీ మొహం భయంకరంగా వుంటుందని డ్రైవరు నాకు చెప్పాడు. నేను ఓ క్షణం బాధపడ్డాను. ఇప్పుడీ నిజం నాకు తెలుసని చెప్పేందుకు నాకు సాహసం లేదు. తెలిసీ చేసుకున్నానంటే నేను స్వార్థపరుడిననుకుంటావు. ఐయామ్ సారీ... ఈ మంట నాగుండెల్లోతుల్లో అణగారిపోనీ...' ఫ్రైడే మౌనంగా వుండిపోయాడు.

ఇప్పుడు ఇంట్లో కొత్త డ్రైవరు వ... ...డు... ...త డ్రైవరు వెళ్ళిపోయాడు.. ఈ ఏర్పాట్లన్నీ ఫ్రైడే ...డు. అదీ మహతికి తెలియకుండా.

అతని పాట సాగుతూనే వుంది. ఆమె ఆ పాటనే బాటగా అతని నీడలో సుఖంగా బతుకుతోంది. అతని పాటకీ, బతుక్కీ అపశృతి లేదు. అది అతని గళంలో పలకదు.